

వనమహోత్సవంలో ఇంటికో మొక్క నాటాలి

మేడ్చల్ టౌన్, జూలై 6: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవంలో భాగంగా ప్రతీ ఒక్కరు ఇంటికో మొక్క నాటాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 1వ, వార్డులో వనమహోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బి.నాగిరెడ్డి, కౌన్సిలర్లు దితరులు పాల్గొన్నారు.



కులకచర్లలో నర్సరీని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

కులకచర్లలో కేంద్ర బృందం పర్యటన

కులకచర్ల, జూలై 6: కులకచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను ఇండియన్ అకౌంటెంట్ అండ్ ఆడిట్ సర్వీసెస్ అకౌంట్ జనరల్ అధికారుల బృందం శనివారం పరిశీలించింది. పంచాయతీ పరిధిలో నర్సరీ, రోడ్డుకు రెండు వైపుల నాటిన మొక్కలు, పంచాయతీ కార్యాలయంలో రికార్డులతో పాటు పలు అభివృద్ధి పనులను బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ వ్యవస్థ పనితీరు, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం యొక్క ఔన్నత్యాన్ని డీఎల్‌పీవో శంకర్‌నాయక్ వారికి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించారు. పంచాయతీల అభివృద్ధి, రికార్డుల నిర్వాహణ గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ప్రాథమిక విద్య, ఆరోగ్యం, వ్యవసాయఅభివృద్ధి, ప్రభుత్వంలో మహిళల భాగస్వామ్యం తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బృందం అధికారి బాలకృష్ణ, నల్లమోత్తు, పియుష్‌కుమార్, సీనియర్ ఆడిటర్స్ శేఖర్, గౌతమ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, ఎంపీవో కరీం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

నాణ్యమైన భోజనం అందించాలి

● జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

మర్పల్లి, జూలై 6: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. శనివారం మర్పల్లి మండలంలోని బూచన్‌పల్లి జిల్లా పరిషత్, మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కస్తూర్బాగాంధీ పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. భోజనం వండే సమయంలో నిర్లక్ష్యంగా వహించొద్దన్నారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నోటు బుక్‌లు, యూనిఫాంలు పంపిణీ చేశారా అని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థం అవుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బూచన్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు పనులు ఏ విధంగా చేస్తున్నారని, ఏఏ పాఠశాలల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలుసుకున్నారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో మురుగు కాల్వ మరమ్మతులు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పనులకు నిధులు మంజూర్ చేయిస్తామన్నారు.

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగుల సాధారణ బదిలీల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. జనరల్ ట్రాన్స్‌ఫర్ కోసం వివిధ శాఖల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నారు. నెల రోజుల పాటు కొనసాగిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగియగానే ప్రభుత్వం జనరల్ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణ బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో బదిలీలకు మార్గం సుగమమైంది.

- ● జిల్లాలో ప్రభుత్వ అజమాయిషీలో 63 శాఖలు
- ● మిగతా శాఖల్లో వివిధ హోదాల్లో మూడు వేల మంది ఉద్యోగులు
- ● నాలుగేళ్లు ఒకేచోట పని చేస్తే ట్రాన్స్‌ఫర్ తప్పనిసరి
- ● ప్రతి కేడర్‌లో 40 శాతం..
- ● పారదర్శకంగా జరిగేలా చర్యలు
- ● జాబితాను సిద్ధం చేస్తున్న అధికారులు



సాధారణ బదిలీలకు కసరత్తు!

ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ ప్రారంభం



వికారాబాద్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి)/తాండూరు, జూలై 6: సాధారణ బదిలీల కోసం సంవత్సరాల తరబడి వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి సాధారణ బదిలీలు నిర్వహించకపోవడంతో వివిధ శాఖల జిల్లా అధికారులు, కిందిస్థాయి అధికారులు, ఉద్యోగులు దీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన ఉద్యోగులు, ఖాళీల వివరాలను ప్రదర్శిస్తారు. 9 నుంచి 12వ తేదీ వరకు ఉద్యోగులు తాము బదిలీ కోరుకునే ప్రదేశాలకు ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. 13 నుంచి 18వ తేదీ వరకు ఆయా శాఖల అధికారులు బదిలీ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, కౌన్సెలింగ్ నిర్వహించేందుకు జాబితా తయారు చేస్తారు. బదిలీ అయిన ఉద్యోగులకు 19, 20వ తేదీల్లో ఉత్తర్వులు జారీ చేయనున్నారు. జిల్లా స్థాయి ఉద్యోగుల బదిలీ ప్రక్రియ కలెక్టరేట్ కేంద్రంగా కొనసాగనుంది. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఆయా శాఖల అధికారులు కన్వీనర్లుగా వ్యవహరించనున్నారు. శాఖల అధికారులు రూపొందించే జాబితాల ఆధారంగా ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. జిల్లాలో ప్రభుత్వ అజమాయిషీలో కొనసాగే శాఖలు 63 ఉన్నాయి. ఈ శాఖల్లో జిల్లా స్థాయి అధికారితో పాటు జోనల్, మల్టీ జోనల్, రాష్ట్ర స్థాయి విభాగాల పరిధిలోకి వచ్చే వివిధ హోదాల్లో అధికారులు, ఉద్యోగులు ఉంటారు. జిల్లాలో ఉపాధ్యాయులు, పోలీసులను మినహాయిస్తే మిగతా శాఖల్లో వివిధ హోదాల్లో మూడు వేల మంది వరకు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగుల్లో బదిలీలకు అర్హత ఉన్న వారిలో 40 శాతం మంది బదిలీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. జిల్లా స్థాయి ఉద్యోగుల బదిలీలు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జరగనుండగా, జోనల్, మల్టీ జోనల్, రాష్ట్ర స్థాయి బదిలీలు హైదరాబాద్ వేదికగా ఆయా శాఖల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనసాగనున్నాయి.

తప్పనిసరి బదిలీ

ఉపాధ్యాయులు, పోలీసులు మినహా ఇతర శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు 2024, జూన్ 30వ తేదీ నాటికి ఒకేచోట నాలుగేళ్లు పనిచేసి ఉంటే తప్పనిసరిగా బదిలీ కానున్నారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సాధారణ బదిలీల్లో దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించారు. ప్రతి కేడర్‌లోనూ 40 శాతం మించి బదిలీలకు అనుమతించరు. ప్రభుత్వ ఆదేశాలతో ఆయా శాఖల జిల్లా అధికారులు ఉద్యోగుల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కేడర్ల వారీగా కేటాయించిన పోస్టుల్లో ఎంత మంది పనిచేస్తుంటే..ఎన్ని ఖాళీలు ఖాళీగా ఉన్నాయి, పని చేస్తున్న వారు కొనసాగుతున్న చోట ఎప్పటి నుంచి విధులు నిర్వహిస్తున్నారనే వివరాలతో ఈనెల 8వ తేదీలోగా ఉద్యోగుల పూర్తి సమాచారంతో జాబితాలు సిద్ధం చేసే పనిలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. నాలుగేళ్లకు మించి ఒకేచోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వివరాలను 8వ తేదీలోగా ప్రకటించాల్సి ఉంది.

ఏళ్ల తరబడి ఎదురు చూపులు

వివిధ శాఖల్లో సంవత్సరాల తరబడి ఒకేచోట విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు తమ బదిలీలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. చాలాకాలంగా సాధారణ బదిలీలు నిర్వహించకపోవడంతో వివిధ శాఖల్లో అధికారులు, ఉద్యోగులు ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వహిస్తున్నారు. పరిపాలనా పరమైన బదిలీలు తప్ప సాధారణ బదిలీలు నిర్వహించలేదు. విధి నిర్వహణ కోసం తమ ప్రాంతాల నుంచి దూరంగా వచ్చిన ఉద్యోగులు సాధారణ బదిలీల కోసం ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన అధికారులు తిరిగి జిల్లాకు వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

పారదర్శకంగా చేపట్టాలి



రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలకు అనుమతించడం హర్షణీయం. తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులు 17ఏళ్లుగా సాధారణ బదిలీలకు నోచుకోవడం లేదు. గత ప్రభుత్వం 2018, మే నెలలో సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసినా అప్పటి జడ్పీ చైర్మన్ల విధాన నిర్ణయం వల్ల మినిస్టీరియల్ ఉద్యోగులు బదిలీలకు నోచుకోలేకపోయారు. ఫలితంగా పంచాయతీరాజ్ ఉద్యోగులు సాధారణ బదిలీలకు దూరమై ఒకేచోట ఎక్కువ కాలం పని చేస్తూ చాలా ఇబ్బందులు పడుతున్నారు. నిషేధం ఎత్తి వేసి ప్రభుత్వం సాధారణ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఉద్యోగులకు ఎంతో ఊరట కలిగే అంశం. అర్హులైన ఉద్యోగులకు నష్టం జరగకుండా బదిలీల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలి.

- ఏ. నందకుమార్, టీపీఆర్ఎంఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నాలుగు స్థాయిల్లో బదిలీలు

సాధారణ బదిలీలు నాలుగు స్థాయిల్లో జరగనున్నాయి. వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు సివిల్ సర్జన్లు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఆ స్థాయి అధికారులు రాష్ట్ర స్థాయిలో బదిలీ కానున్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, వ్యవసాయాధికారులు, ఏఈఈలు, ఎస్‌డబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, ఏటీవోలు, మునిసిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ సివిల్ సర్జన్లతో పాటు ఆ స్థాయి కలిగిన అధికారులకు మల్టీజోన్ -2 పరిధిలో బదిలీ జరగనుంది. మల్టీ జోన్-2 పరిధిలో వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, జనగాం, సూర్యాపేట్, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలో ఖాళీలు, సీనియారిటీ ఆధారంగా బదిలీ జరగనున్నాయి. గత ఎన్నికల సమయంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేయగా, వారిని తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. కాగా, ఈ విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఇంకా స్పష్టత రాలేదు. కాగా, జోనల్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లు, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులు, వసతి గృహ సంక్షేమాధికారులు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, వెటర్నరీ అసిస్టెంట్లతో పాటు ఆ స్థాయి కలిగిన ఉద్యోగులకు చార్మినార్ జోన్ పరిధిలో బదిలీలు జరగనున్నాయి. వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఎక్కడికైనా బదిలీ జరిగే అవకాశం ఉంటుంది. అదే జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు తదితర ఉద్యోగులను జిల్లా స్థాయిలో బదిలీ చేయనున్నారు. ఈ బదిలీలు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జరగనున్నాయి.

మునిసిపల్, మండల పరిధిల్లో ప్రజావాణి నిర్వహించాలి

● కలెక్టర్ ప్రతీక్ జైన్



వికారాబాద్, జూలై 6: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మునిసిపల్, మండల పరిధిలో తప్పని సరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జూలై 8 నుంచి మండల స్థాయిలో తహసీల్దార్, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అదే విధంగా మునిసిపల్ పరిధిలో ఆయా కార్యాలయాల్లో ప్రజావాణి ఉంటుందని తెలిపారు. మండల, మునిసిపల్ పరిధిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం మండల, మునిసిపల్ ప్రజావాణిని నిర్వహిస్తున్నట్లు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఐటీఐ అప్రెంటిస్‌షిప్ మేళా

వికారాబాద్, జూలై 6 : ఈనెల 8న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) మర్పల్లి, వికారాబాద్‌లో అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎజాజ్‌మసీఉద్దీన్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ఐటీఐ పాస్ అయిన విద్యార్థులకు వివిధ కంపెనీలలో అప్రెంటిస్ ఇప్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్రెంటిస్‌షిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుని అనంతరం దరఖాస్తు ఫారం, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఐటీఐ మర్పల్లి, వికారాబాద్ నందు సోమవారం ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 98490533395 మొబైల్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

పదవీకాలం ముగిసినా.. ఎదురు చూపులేనా?

- ● స్థానిక ప్రజా ప్రతినిధులకు అందని గౌరవ వేతన బకాయిలు
- ● ఎనిమిది నెలలుగా పెండింగ్



వికారాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పదవీ కాలం ముగిసినా... స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు పెండింగ్ గౌరవ వేతనం అందలేదు. ఎనిమిది నెలలుగా వారు గౌరవ వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలకు ఎనిమిది నెలల గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. 2023, అక్టోబరు నెల వరకు జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు అందాయి. ఈనెల 3న ఎంపీపీలు, ఎంపీటీసీల పదవీ కాలం ముగియగా, 4న జడ్పీ చైర్ పర్సన్, జడ్పీటీసీల పదవీ కాలం ముగిసింది. పదవీ కాలం ముగిసినా తమకు రావాల్సిన గౌరవ వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో జిల్లా ప్రజా పరిషత్తు, 18 మండల ప్రజా పరిషత్తులు ఉన్నాయి. 18 మంది జడ్పీటీసీలు, 221 మంది ఎంపీటీసీలు ఉన్నారు. జడ్పీ చైర్‌పర్సన్‌కు గౌరవ వేతనం కింద నెలకు రూ. లక్ష, జడ్పీటీసీలకు రూ.13 వేలు, ఎంపీపీలకు రూ.13 వేలు, ఎంపీటీసీలకు రూ.6,500 గౌరవ వేతనం ప్రభుత్వం చెల్లిస్తున్న విషయం తెలిసిందే. గత ఏడాది నవంబరు నుంచి 2024, జూన్ నెల వరకు జడ్పీ, మండల ప్రజా పరిషత్తుల పాలక వర్గాల సభ్యులకు గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. పదవీ కాలం ముగిసిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు పెండింగ్ గౌరవ వేతనాలు వెంటనే చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జడ్పీ, మండల పరిషత్తు పాలకవర్గాల మాజీ సభ్యులు కోరుతున్నారు.

ఇంకెన్నాళ్లు?

ఏళ్ల తరబడి రైతు బజారు నిర్మాణం

- ● ఎందుకూ కొరగాని పనులు
- ● పిల్లర్లతోనే ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్
- ● స్థల వివాదంతో నిలిచిపోయిన షాపింగ్ కాంప్లెక్స్
- ● రోడ్డుపై సంత.. ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు



నిలిచిపోయిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు

పరిగి, జూలై 6: పరిగి పట్టణంలో జరిగే సంతకు ప్రత్యేకస్థలం లేక వ్యాపారులు, ప్రజలు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ప్రతి శుక్ర, శనివారాల్లో జరిగే మార్కెట్‌ను పట్టణంలోని నడిబొడ్డున ఉన్న ప్రధాన రహదారులపై నిర్వహించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఒక పక్క పరిగి పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఈ రోడ్ల పైనే ఎక్కడపడితే అక్కడ ప్రైవేట్ వాహనాలు, ఆటోలు పార్కింగ్ చేయడం తో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో రోడ్డు పైనే కొనసాగే ఈ సంతను ఏడాది పాటు మార్కెట్ కమిటీ స్థలంలో కొనసాగించారు. అట్టి స్థలంలో రైతు బజారు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని పాలకవర్గం నిర్ణయించి పనులు ప్రారంభించింది. అయితే శుక్ర, శనివారాల్లో నిర్వహించే సంతను రెండు, మూడు చోట్ల రోడ్లపై ఏర్పాటు చేయడంతో నడవడానికి కూడా వీల్లేకుండా పోయింది. రైతులు, వ్యాపారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కూరగాయలు అమ్ముకుంటున్నారు. 2002లో రైతు బజారు ఏర్పాటు కోసం అప్పటి ఎమ్మెల్యే కె.హరీశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేసిన విషయం విదితమే. శిలాఫలకం వేసి ఇరవై ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గత మార్కెట్ కమిటీ రూ.75 లక్షలతో రైతు బజారును, రూ.67 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని నిధులు మంజూరీ చేసింది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అయితే నిర్మాణ స్థలం తమదని కొందరు వ్యక్తులను కోర్టును ఆశ్రయించారు. దీంతో రైతు బజారు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు మూడేళ్లుగా నిలిచిపోయాయి. ఇంటిగ్రేటెట్ మార్కెట్ నిర్మాణ పనులు కూడా స్లాబ్ స్థాయిలోనే నిలిచిపోయాయి. రైతుల బజారు నిర్మాణం ఇక వివాదంగా మారింది. ఇదిలా ఉండగా, కూరగాయల సంతలు మాత్రం రోడ్డుపైనే కొనసాగుతుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శుక్ర, శనివారాల్లో నిర్వహించే కూరగాయల సంత రోడ్లపైనే నిర్వహించడంతో పాదచారులు కూడా నడవలేని పరిస్థితి నెలకొంది. పరిగి నియోజకవర్గంలోని కులకచర్ల, దోమ, బొంరాసిపేట్, పూడూర్ గ్రామాలకు చెందిన వేలాది మంది వస్తుంటారు. వారానికి రెండు రోజులు జరిగే ఈ సంత రోజుల్లో చిల్లర దుకాణాలు, కూరగాయలు విక్రయాలు జరుపుకోవడానికి ప్రత్యేక సదుపాయాలు లేకపోవడంతో రోడ్డుపైనే నిర్వహిస్తున్నారు. దీంతో గతంలో పలుసార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న వ్యాపారలావాదేవిల మూలంగా సంతరోజుల్లో జనం కిక్కిరిసి పోతుంది. దీని మూలంగా ఇబ్బందులు తప్పడం లేదంటూ వినియోగిదారులు, వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలం అయితే నానా అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు.



నిలిచిన ఇంటిగ్రేటెడ్ రైతు బజారు పనులు

ఇంటిగ్రేటెడ్ రైతు బజార్ పనులు పూర్తి చేయాలి



పరిగిలో రైతు బజారు నిర్మాణ పనులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. కూరగాయలు పండించే రైతులు అమ్ముకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. మధ్యలో పనులు నిలిచిపోవడం, స్థలాభావంతో ఇబ్బందిగా మారింది. మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తి చేయాలి.

-బి.వెంకట్‌రెడ్డి, బీకేఎస్ మండల అధ్యక్షుడు,పరిగి

చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి



పరిగిలో ఏర్పాటు చేసే రైతు బజారులో చేపల మార్కెట్‌ను కూడా ఏర్పాటు చేయాలి. పరిగి ప్రాంతంలో మత్స్యకారులు చాలా ఎక్కువగా ఉంటారు. రైతు బజారును త్వరగా పూర్తి చేసే అందులో మత్స్యకారులకు ప్రత్యేకంగా షెడ్‌లను పూర్తి చేయాలి. రైతులకు విశ్రాంతి భవనం, ఇతర వసతులు కల్పించాలి.

- ఆనెం ఆంజనేయులు, మత్స్యవిభాగం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

రైతు బజారును త్వరగా ఏర్పాటు చేయాలి



పరిగిలో రైతుబజారు త్వరగా ఏర్పాటు చేయాలి. రోడ్డుపై ఇరుకు స్థలంలో నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మార్కెట్ శాఖ అధికారులు త్వరగా రైతు బజారు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. రైతు బజారులో వ్యాపారులకు కాకుండా రైతులకు అవకాశం ఇవ్వాలి.

-టీవీ నర్సింహులు, బీజేపీ కార్యదర్శి, పరిగి

యాలాల్‌లో 51మి.మీ వర్షం



పరిగిలో రోడ్డుపై వరద ప్రవాహం

వికారాబాద్,(ఆంధ్రజ్యోతి)/పరిగి/కొడంగల్, జూలై 6 : జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం ప్రారంభమైన వర్షం అర్ధరాత్రి వరకు కొనసాగింది. రాత్రి 9.30 గంటల వరకు జిల్లాలో అత్యధికంగా యాలాల్ మండలంలో 51.0మి.మీ వర్షం కురిసింది. బషీరాబాద్‌లో 50.5 మి.మీ, తాండూరులో 47.8 మి.మీ, చౌడాపూర్‌లో 31.3 మి.మీ, దోమలో 29.0 మి.మీ, కులకచర్లలో 29.0 మి.మీ, పెద్దేముల్‌లో 28.8 మి.మీ, దుద్యాల్‌లో 28.8 మి.మీ, ధారూరులో 26.5 మి.మీ, దౌల్తాబాద్‌లో 21.8 మి.మీ, పూడూరులో 21.5 మి.మీ, పరిగిలో 19.0 మి.మీ, కొడంగల్‌లో 16.0 మి.మీ, వికారాబాద్‌లో 13.5 మి.మీ, పూడూరులో 11.8 మి.మీ, బొంరాస్‌పేటలో 11.3 మి.మీ, బంట్వారంలో 5.5 మి.మీ, తాండూరులో 5.5మి.మీ, వర్షపాతం నమోదైంది.వర్షాలకాలం ప్రారంభం తర్వాత పరిగిలో భారీ వర్షం కురియడం ఇదే మొదటిసారి. గతంలో విత్తిన విత్తనాలకు ఊపిరి పోసినట్లైంది. పరిగి పట్టణంలోని పలు కాలనీలు బురదమయంగా మారాయి. తిరుమల రెసిడెన్సీలో రోడ్డుపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వికారాబాద్ మునిసిపల్, మండల పరిధి, కొడంగల్‌లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలో ప్రజలు కొంత ఇబ్బంది పడినప్పటికీ, ఈ వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అద్దె చెల్లింపులపై అధికారుల గుర్రు

● ఆలయ దుకాణాలకు తాళం.. వాగ్వాదానికి దిగిన వ్యాపారులు

● పరిగి వేంకటేశ్వరాలయం వద్ద ఉద్రిక్తత



వేంకటేశ్వరస్వామి ఆలయ దుకాణాలను సీజ్ చేస్తున్న అధికారులు



దేవాదాయ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగిన వ్యాపారులు

పరిగి, జూలై 6: పరిగిలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన దుకాణ సముదాయం అద్దె చెల్లింపు విషయంలో అధికారులకు, వ్యాపారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది కాస్త ఉద్రిక్తతకు దారి తీసింది. శనివారం దేవాదాయ శాఖ అధికారులు మధుబాబు, శ్రీనివాసశర్మ, నరేందర్, చంద్రమోహన్, ఆంజనేయులు, రమేష్‌శర్మ తదితరుల బృందం పోలీసు బందోబస్తుతో ఆలయవ వద్దకు చేరుకున్నారు. దుకాణదారులు అద్దె చెల్లించడం లేదని అధికారులు షట్టర్లకు తాళాలు వేసేందుకు యత్నించారు. ఈక్రమంలో వ్యాపారులు, ఆలయ పాత కమిటీ, అధికారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 37 ఏళ్ల క్రితం నిర్మించిన దేవాలయం రాజకీయ ఆధిపత్యం కారణంగా కొంతకాలంగా వివాదస్పదంగా మారిన విషయం విధితమే. 2016లో అప్పటి ఎమ్మెల్యే సిఫారసుతో ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలో చేర్చారు. 2018 తర్వాత అప్పట్లో ఎన్నికైన ఎమ్మెల్యే సిఫారసుతో పాత కమిటీతో ఐదేళ్లు కొనసాగింది. 2023లో తిరిగి కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన రామ్మోహన్‌రెడ్డి సూచనతో దేవాదాయ శాఖలో కలిపారు. అయితే, ఆలయ పాత కమిటీ ఈ విషయమై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. స్టే ఇచ్చింది. ఆ తర్వాత జరిగిన ఉత్సవాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహించారు. ఇదిలా ఉండగా, ఆలయానికి చెందిన దుకాణాలకు సంబంధించి వ్యాపారులు అద్దె చెల్లించడం లేదని అధికారులు నోటీసీలు కూడా జారీ చేశారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అధికారులు దుకాణాలకు తాళాలు వేశారు. వ్యాపారులు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. అద్దె చెల్లించకపోతే ఎలా ఊరుకుంటామని అధికారులు ప్రశ్నించారు. తాము మొదట్లో రెండు లక్షల డిపాజిట్ చేశామని, వాటి సంగతి ఏంటని వ్యాపారులు ప్రశ్నించారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువురిని సముదాయించారు. వ్యాపారులు అద్దె చెల్లించేందుకు ఒప్పకున్నారు. నాలుగు నెలలు పెండింగ్ అద్దెను చెల్లించేందుకు ఒప్పుకోవడంతో అధికారులు దుకాణాల తాళాలు తీసివేశారని దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపుపై
ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి



మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జూలై 6: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి తాజా మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా చూడాలని బీజేపీ శాసనసభా పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి 2024 వరకు గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం జరిగిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం అప్పట్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు విడుదల చేయకపోవడంతో అప్పులు చెల్లించామని తెలిపారు. వీధిలైట్ల నిర్వహణ, అంతర్గత మురుగు కాల్వలు, గ్రామ పంచాయతీ భవనాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, మన ఊరు-మన బడి, వైకుంఠ ధామాలు, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులకు సంబంధించి కోట్ల రూపాయలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ దృష్టికి పెండింగ్ బిల్లుల చెల్లింపు గూర్చి తీసుకుపోయినా స్పందన లేకపోవడంతో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లువారు పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పెండింగ్ బిల్లుల చెల్లింపు గూర్చి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మహేశ్వర్ రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, ఉపాధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, మల్లేశ్ ముదిరాజ్, మదుసూధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీరామ్‌రెడ్డి, మెదక్‌జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, రామేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన జిల్లా న్యాయాధికారి



మేడ్చల్ టౌన్, జూలై 6 : ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా శనివారం మేడ్చల్ కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయాధికారి బాల భాస్కర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ కోర్టు జడ్జిలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం.. రైతుల హర్షం

కొందుర్గు, జూలై 6: షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో 9 గ్రామాలకు విద్యుత్ ఓవర్ లోడ్ సమస్య తీరింది. శనివారం ఆగిర్యాల గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఆగిర్యాల విద్యుత్ సబ్ స్టేషన్‌లో పదేళ్లుగా ఓవర్ లోడ్ సమస్య నెలకొంది. దాంతో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. రైతులు సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. మండల పరిధిలోని ఆగిర్యాల, పాత ఆగిర్యాల, ఘటియా తండా, నాగార్జున హేచరీస్, వెంకిర్యాల, లక్ష్మీదేవునిపల్లి, విశ్వనాథ్‌పూర్, తంగళ్లపల్లి, తిర్మన్‌దేవునిపల్లి గ్రామాల్లోని దాదాపు 1200 బోర్లకు సంబంధించిన రైతులు ఓవర్ లోడ్ సమస్యను ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సమస్యను తెలియజేశారు. ఓవర్ లోడ్ సమస్యను తీర్చేందుకుగాను ఆగిర్యాల 33/11కేవీ సబ్‌స్టేషన్‌కు 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయగా.. శనివారం ఉదయం ఏర్పాటు చేశారు. రైతులు ఎమ్మెల్యే శంకర్‌కు, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో రైతుల సమస్యలతో పాటు 9 గ్రామాల్లో కరెంట్ సమస్యలు కూడా తీరాయని విద్యుత్ శాఖ సిబ్బంది తెలిపారు.



ఆగిర్యాల సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

'ఆషాఢం'.. ఆరంభం

● నేటి నుంచి అమ్మవార్లకు బోనాలు

● ఉట్టిపడనున్న సంస్కృతీ సంప్రదాయాలు



తాండూరు, జూలై 6: ఆషాఢ మాసంలో వచ్చే పెద్ద పండుగ బోనాలు. పల్లెలు, పట్టణాల్లో ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. తొలి ఆదివారం.. నేటి నుంచి ప్రారంభమయ్యే బోనాలు ఆగస్టు 4వ తేదీతో ముగుస్తాయి. దాదాపు నెల రోజులపాటు బోనాల సంబురాలు జరుగుతాయి. వేప మండలు, ఆకుల తోరణాలతో పట్టణాలు, పల్లెల్లో అమ్మవార్ల ఆలయాలను తీర్చిదిద్ది ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఇష్టదైవాలను స్మరించుకుంటూ పాటలు, భజనలు చేస్తారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ప్రజలు పులకించిపోతారు. ఈ సందర్భంగా సల్లంగ సూడు తల్లీ.. అంటూ ప్రజలు, భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటారు. కాగా, ప్రతీ ఏడాది తాండూరు పట్టణంలో కాళికాదేవి, కట్టమైసమ్మ, పాత తాండూరు బోనమ్మ వంటి పురాతనమైన అమ్మవార్ల దేవాలయాల్లో బోనాలను ఘనంగా నిర్వహిస్తారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఉత్సవాలు జరుపుకుంటారు.

సమాజ్‌వాదీ పార్టీ
రాష్ట్ర కార్యదర్శిగా శ్రీహరి ముదిరాజ్



నియామకపత్రం అందిస్తున్న సింహాద్రి

మహేశ్వరం, జూలై 6 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం గ్రామానికి చెందిన కటికెల శ్రీహరి ముదిరాజ్ సమాజ్‌వాదీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం నగరంలోని తార్నాకలోగల రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు సింహాద్రి చేతులమీదుగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీహరి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ సమాజ్‌వాదీ పార్టీ ఆదేశానుసారం తెలంగాణలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

కౌన్సిల్ మీటింగ్ ఎప్పుడో?

● వరద ప్రాంత కౌన్సిలర్ల ఆవేదన

● నాలుగు నెలల క్రితం సమావేశమైన తాండూరు మున్సిపల్ కౌన్సిల్

● లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసి నెలరోజులైనా మీటింగ్ ఊసే లేదు!

తాండూరు, జూలై 6: తాండూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారోనని కౌన్సిలర్లు ఎదురుచూస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఫిబ్రవరి 19న మున్సిపల్ బడ్జెట్, సాధారణ సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల్ కోడ్ నేపథ్యంలో మున్సిపల్ సాధారణ సమావేశాలు మార్చి నెల నుంచి నిర్వహించనేలేదు. దాదాపు ఐదు నెలలు గడుస్తున్నా కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవడంతో కౌన్సిలర్లు ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసి నెల రోజులైంది. వర్షకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలడడంతో పాటు వరదలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం వరద సమస్యపై చర్చించేందుకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలి కదా.. ఇదేమి పాలన అంటూ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. అత్యవసరం అనుకుంటే అభివృద్ధి పనులు కాకుండా ఇతర సమస్యలపై సమావేశం నిర్వహించి చర్చించుకోవచ్చు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే పలు కాలనీలు నీట మునిగాయి. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటుచేసి వర్ష కాలంలో తీసుకోవాల్సిన చర్యలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు, వరద ప్రాంతాల్లో ప్రత్యేకంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించుకోవాల్సి ఉందని, కుక్కల బెడద ఎక్కువైందని పలువురు కౌన్సిలర్లు వాపోతున్నారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోతే ఎలా ముందుకు వెళ్లాలని కౌన్సిలర్లు చర్చించుకుంటున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కీసర రూరల్, జూలై 6 : నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి 16వ వార్డులోని చండాశ్వర్‌నగర్ కాలనీలో మున్సిపల్ నిధులు రూ.21లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, నాయకులు మోకు జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

మహేశ్వరం, జూలై 6 : ఎన్నికలకు ముందు రైతాంగానికి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ కూడా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతూ కాలయాపన చేస్తోందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం మహేశ్వరం మండలం నాగారం లోని కుండె వెంకటేష్ వ్యవసాయ క్షేత్రంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేయడానికి కమిటీలు వేస్తుందే తప్పా.. ఆ కమిటీలు కార్యరూపం దాల్చడానికి కాదన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆర్థిక తోడ్పాటు, పంటల బీమా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8, 9వ తేదీల్లో అన్ని మండల కేంద్రాల్లో కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దీక్షలను విజయవంతం చేసేందుకు కిసాన్‌మోర్చా నాయకులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి ఇతర పార్టీల వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యలపై లేదన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు కిసాన్‌మోర్చా అండగా ఉంటుందని, అవసరమైతే పోరాటాలకు వెనకాడబోదన్నారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గసభ్యుడు బస్వ పాపయ్యగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాసాని వెంకటేష్‌గౌడ్, బొక్క నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మిద్దె సుదర్శన్ రెడ్డి, కుండె వెంకటేష్, నిరంజన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డితో పాటు మాధవాచారి, పి.సుదర్శన్‌యాదవ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల/నవాబుపేట, జూలై 7 : ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శనివారం రాష్ట్ర వ్యవసాయ, రెవెన్యూ శాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను నగరంలోని వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని యాదయ్య శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండలాధ్యక్షుడు, వీరేందర్‌రెడ్డి నవాబుపేట మండల నాయకులు తదితరులు ఉన్నారు.



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

లక్షలు వెచ్చించారు.. అసంపూర్తిగా వదిలేశారు

● నిలిచిపోయిన వ్యవసాయ శాఖ కార్యాలయం అదనపు గది నిర్మాణ పనులు



అసంపూర్తిగా ఉన్న అదనపు గది నిర్మాణం

ఆమనగల్లు, జూలై 6 : పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయ అదనపు గది నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అసంపూర్తి పనుల పూర్తి విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదు. దాంతో భవనం వినియోగంలోకి రాకుండాపోయింది. ఆమనగల్లు వ్యవసాయ శాఖ కార్యాలయానికి సరిపడా గదులు లేక గతంలో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో అదనపు గదుల నిర్మాణం గురించి స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. 18 ఏళ్ల క్రితం అదనపు గది నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో కార్యాలయ పైభాగంలో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి స్లాబ్ వరకు పూర్తి చేశాడు. ఆ తర్వాత కారణమేదైనా కావొచ్చుగానీ.. పనులు నిలిచిపోయాయి. నిధులు వెనక్కి మళ్లాయి. అసంపూర్తి పనులను పూర్తిచేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలని ఏళ్లకాలంగా స్థానికులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందన లేదు. దాంతో భవనం ఎందుకూ పనికిరాకుండా పోయింది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని పనులు పూర్తిచేయించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం

● జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలో 1.44 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

చౌదరిగూడ, జూలై 6 : వనమహోత్సవంలో కార్యక్రమంలో భాగంగా మండలంలో నాటేందుకు అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో నర్సరీలో 6 వేల మొక్కల చొప్పున 1.44 లక్షల మొక్కలను సిద్ధం చేసినట్లు జాతీయ ఉపాధి హామీ పథకం అధికారులు తెలిపారు. కాగా, ఒక్కో నర్సరీ నిర్వహణకు ప్రభుత్వం రూ.1.45 లక్షలు ఖర్చు చేస్తోంది. ఈనెల చివరిలోగా నర్సరీలోని అన్ని మొక్కలను నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

నర్సరీల్లో పండ్లు, పూలు, ఔషధ మొక్కలు

గ్రామాల్లోని నర్సరీల్లో ఔషద మొక్కలతో పాటు పండ్ల, పూల మొక్కలైన.. జీడి, పతంగి, ఖర్జూరా, ఈత, నీలగిరి, బాదం, రైన్‌ట్రీ, బూర్గు, అల్లనేరేడు, సుభాబుల్, గులాబీ, మల్లె, నర్వి, పారిజాతం, కరివేపాకు, గోరింటాకు, వేప, జామ, నిమ్మ, గుల్‌మొహర్, ఉసిరి, నేరేడు, చింత, సీతాఫలం, టికోమా, కానుగ, బొప్పాయి తదితర మొక్కలు నర్సరీల్లో పెంచారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలను ప్రభుత్వ స్థలాల్లోనే కాకుండా, ఖాళీ స్థలాల్లో అధికారులు నాటేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. అదేవిధంగా ప్రతీఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో నాటుకోవడానికి మొక్కలు పంపిణీ చేయనున్నారు.



పెద్దఎల్కిచర్లలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

భారీ వర్షం.. జనం బేజారు

● కొత్తూర్ అండర్‌పాస్‌లో నీట మునిగిన కారు
● బయటకు తీసిన స్థానికులు.. తప్పిన ప్రమాదం
● అండర్‌పాస్‌ను బంద్ చేసిన పోలీసులు.. వైజంక్షన్ పునరుద్ధరణ
● యాచారంలో భారీ వాన.. సాగర్-హైదరాబాద్ హైవేపై గంటన్నర పాటు రాకపోకలకు అంతరాయం



యాచారంలో కురుస్తున్న వర్షం



షాబాద్ : బోడంపహాడ్, మన్‌మర్రి గ్రామాలకు వెళ్లే రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

కొత్తూర్/యాచారం/షాబాద్, జూలై 6: మండల పరిధిలో భారీ వర్షం కురిసింది. దాంతో జనం బేజారయ్యారు. కాగా, అధికారుల నిర్లక్ష్యం.. డిజైన్ లోపం కారణంగా కొత్తూర్ అండర్ పాస్ ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అండర్‌పాస్ రహదారి వర్షపునీటితో నిండిపోయింది. దాంతో అటుగా వచ్చిన ఓ కారు నీటిలో చిక్కుకొని పోగా, స్థానికులు గమనించి బయటకు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. కొత్తూర్ మండల కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారి వద్ద వైజంక్షన్ నెలకొని ఉంది. హైదరాబాద్ నుంచి కొత్తూర్, షాద్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు వైజంక్షన్‌ను వద్ద క్రాస్ చేయాల్సి ఉంటుంది. అయితే, తరచూ ప్రమాదాలు సంభవిస్తుండడంతో వైజంక్షన్ సమీపంలో మూడు సంవత్సరాల క్రితం దాదాపు 12కోట్ల రుపాయలు వెచ్చించి అండర్‌పాస్ రహదారిని నిర్మించారు. సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం, డిజైన్ లోపం కారణంతో ప్రతీ సంవత్సరం వర్షకాలంలో అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిలుస్తోంది. ఇటీవల అండర్‌పాస్ వద్ద మరమ్మతులు నిర్వహించడంతో.. స్థానిక పోలీసులు వైజంక్షన్ వద్ద స్టాపర్స్‌ను ఏర్పాటు చేశారు. దాంతో హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు అండర్‌పాస్ గుండా వచ్చి వెళ్తున్నాయి. భారీ వర్షం కారణంగా అండర్‌పాస్ వద్దకు తిరిగి వర్షపు నీరు వచ్చి చేరుతున్న సమయంలో హైదరాబాద్ నుంచి కొత్తూర్ వైపు వస్తున్న ఓ కారు వర్షపు నీటిలో చిక్కుకపోయింది. గమనించిన స్థానికులు కారును వెంటనే బయటకు తీశారు. స్థానికులు స్పందించకుంటే కారు నీటిలో చిక్కుకుని పోయేదని స్థానికులు తెలిపారు. నీటిలో చిక్కుకున్న కారులో కారు నడుపుతున్న వ్యక్తి మాత్రమే ఉన్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది అండర్‌పాస్ వద్దకు చేరుకుని వాహనాలు రాకుండా బారికేడ్లను ఏర్పాటుచేశారు. అండర్‌పాస్ మూసివేయడంతో పోలీసులు తిరిగి వైజంక్షన్ పునరుద్ధంచారు. అండర్‌పాస్ లో నిలిచిన వర్షపునీటిని ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది మోటార్ల ద్వారా బయటకు పంపిస్తున్నారు. అదేవిధంగా యాచారం మండలంలోని యాచారం, చౌదర్‌పల్లి, నందివనపర్తి, మొండిగౌరెల్లి, గున్‌గల్, చిన్నతూండ్ల, కుర్మిద్ద, తాటిపర్తి, మల్కీజ్‌గూడ తదితర గ్రామాలలో శనివారం రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది, గంటన్నర పాటు భారీ వాన కురియడంతో సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై పలుచోట్ల వాహనాలు నిలిచిపోయాయి. యాచారంలో వరదనీరు నిలిచి పోవడంతో వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా పత్తి, జొన్న తదితర పంటలకు చాలా మేలు జరగనుంది. ఖాఖా,కాగా, షాబాద్ మండల పరిధిలోని బోడంపహాడ్, మన్‌మర్రి, అప్పారెడ్డిగూడ గ్రామాలకు వెళ్లే రోడ్డు వర్షాలకు గుంతలమయంగా మారింది. అంతారం గేటు నుంచి అప్పారెడ్డిగూడ వరకు 8 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడింది. దాంతో ఈ దారి వెంట ప్రయాణించాలంటే జనం జంకుతున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు కిందపడి గాయాలపాలైన సంఘనటనలు చాలా ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. శనివారం కురిసిన వర్షానికి గుంతల్లో నీరు నిలవడంతో రోడ్డు మరింత పాడైపోయేలా తయారైంది.



కొత్తూర్: అండర్‌పాస్‌లో నిలిచిపోయిన కారును బయటకు తీస్తున్న స్థానికులు

సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలి

● ఎన్‌ఆర్‌ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్
● సీవీఆర్ కాలేజీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ఆదిభట్ల, జూలై 6 : ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని కఠోర శ్రమ చేయాలని.. అప్పుడే విజయం సాధిస్తారని.. సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని ఎన్‌ఆర్‌ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ విద్యార్థులకు సూచించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లి పరిధిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 20వ గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం రెండు విభాగాలుగా జరిగిన కార్యక్రమానికి ఉదయం తెలంగాణ అడ్మిషన్స్ ఫీ రెగ్యులేటరీ కమిటీ చైర్మన్, జస్టిస్ ఎ.గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కళాశాల చైర్మన్ డాక్టర్ వెంకట రాఘవా చిరాబుడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం జరిగిన ప్రధాన కార్యక్రమానికి ఎన్‌ఆర్‌ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలు అందజేసి ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక రంగంలో పోటీ విపరీతంగా పెరిగిందన్నారు. పోటీ ప్రపంచంలో కొత్త ఆవిష్కరణలకు అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. సాంకేతిక విద్యలో నూతన కోర్సులు వస్తున్నాయని.. ఏ కోర్సు చదివినా నిరంతరం కొత్త విషయాలు తెలుసుకుంటూ ప్రయోగాత్మక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని సూచించారు. జస్టిస్ ఎ.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్ల సాంకేతిక విద్య పూర్తైయిన తర్వాత కూడా జీవిత లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు. బీటెక్ కోర్స్ పూర్తవుతుండగానే ఉద్యోగాలు లభిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చైర్మన్ డాక్టర్ వెంకట రాఘవా చిరాబుడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థలలో రెండు దశాబ్దాలుగా ఎక్కడా కూడా రాజీ పడకుండా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కోర్సులు పూర్తిచేసి పట్టభద్రులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి, బంగారు పతకాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కళాశాల విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే దుస్తులలో సందడి చేశారు. కాగా, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామమోహన్‌రెడ్డి కళాశాల ప్రగతి నివేదికను సమావేశంలో చదివి వినిపించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.రామశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ ఎల్‌సీ శివారెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.నయనతార, అడ్వయిజర్ డైరెక్టర్ సి.మధుసూదన్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి విజయా మేయిర్, కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





ఆదిభట్ల : హాజరైన విద్యార్థులు, మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాష్ చౌహాన్

ప్రతీ విద్యార్థికి మంచి ప్లేస్‌మెంట్

మేడ్చల్ టౌన్ : తమ యూనివర్సిటీలో చదువుకున్న విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్ లభించటం ప్రశంసనీయమని మల్లారెడ్డి యూనివర్సిటీ ఫౌండర్ చైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం మల్లారెడ్డి యూనివర్సిటీలో మొదటి కాన్వొకేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మల్లారెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో చదువుకున్న విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్‌లు లభిస్తున్నాయన్నారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, డిజిటల్ స్టాటిస్టిక్స్‌లో పట్టాలు పుచ్చుకున్న ప్రతీ విద్యార్థికి లక్షకు తగ్గకుండా వేతనంతో ప్లేస్‌మెంట్ లభించటం సంతోషంగా ఉందన్నారు. గతంలో విశ్వవిద్యాలయాలు అంటే ఓయూ, జేఎన్‌టీయూల పేర్లను ప్రస్తావించేవారని, ప్రస్తుతం యూనివర్సిటీ అంటే మల్లారెడ్డి పేరు గొప్పగా చెప్పుకునే స్థాయికి చేరుకున్నామన్నారు. లక్షలాది మంది విద్యార్థులకు వివిధ రంగాల్లో రాణించేందుకు విద్యను బోధిస్తూ.. వారు జీవతంలో గొప్పగా స్థిరపడే విధంగా తమ యూనిర్సిటీ విధులు నిర్వహిస్తుందన్నారు. ప్రపంచానికి కావాల్సిన మేధావులను తమ యునివర్సిటీ అందించటానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. పట్టాలు పుచ్చుకున్న విద్యార్థులు తమ జీవితంలో ప్రతీ విషయాన్ని ఒక సవాలుగా తీసుకుని ముందుకు సాగాలని చెప్పారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పు తీసుకురావాలన్నదే తమ విద్యాసంస్థల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, మేనేజ్‌మేంట్, డిజిటర్ స్టాటిస్టిక్స్‌లో పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు భద్రారెడ్డి, రిజిస్ట్రార్ ఆంజనేయులు, వైస్‌చాన్స్‌లర్ వీఎస్‌కే రెడ్డి, డైరెక్టర్లు శాలినిరెడ్డి, ప్రీతిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ టౌన్ : పట్టాలు పొందిన విద్యార్థులు

పోలీసులకు సవాల్‌గా వరుస దొంగతనాలు

● భయాందోళనలో ప్రజలు

షాద్‌నగర్ రూరల్, జూలై 6: ఇటీవల షాద్‌నగర్ పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. కాగా, వాటిని చేధించడం పోలీసులకు సవాల్‌గా మారింది. రాత్రీపగలు తేడా లేకుండా దొంగలు ఇళ్లల్లో దోపిడీలకు పాల్పడుతున్నారు. దాంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని సాయిబాబా కాలనీలో ఒకే ఇంట్లో రెండుసార్లు దోపిడీ జరిగింది. కాలనీలో నివాసముండే శివరాం రెండు నెలల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన ఇద్దరు దొంగలు శివరాం ఇంటి తాళాలు విరగ్గొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. వరండాలో సీసీ కెమెరాలు ఉన్నాయని తెలిసి.. దొంగతనం జరిగిన తర్వాత దండుగులు సీసీ కెమెరాల డీవీఎం ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత శివరామ్‌కు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ కావడంతో కుటుంబంతో సహా మకాం మార్చారు. మళ్లీ నెలరోజుల తర్వాత దొంగలు ఆయన ఇంట్లో చోరీకి ప్రయత్నించారు. అర్ధరాత్రి ఇంటి ఆవరణలోకి ప్రవేశించినట్లు శివరాం సీసీ టీవీ లైవ్‌ను తన ఫోన్‌లో చూసుకున్నాడు. చుట్టు పక్కల వాళ్లకు చెప్పడంతో వారు బయటకు వచ్చింది గమనించి దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటన జరిగిన పది రోజుల వ్యవధిలోనే అయ్యప్ప కాలనీలో దొంగలు మరో దోపిడీకి పాల్పడ్డారు. అయ్యప్ప కాలనీ ప్రధాన వీధిలో నివాసముండే గాదం రమేష్ ఇంట్లో పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. రమేష్ భార్య, కుమారుడు, కోడలు ఆదివారం ఉదయం 7 గంటలకు కర్నూలులోని హాస్టల్‌లో ఉండే మనవడి వద్దకు వెళ్లారు. రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. దొంగతనం జరిగినట్లు గుర్తించారు. మొయిన్ డోర్ తాళం విరగ్గొట్టిన దొంగలు లోపలికి వెళ్లి మూడు బెడ్‌రూంల తాళాలు విరగ్గొట్టి రూ.2.50 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు, వస్తువులు ఎత్తుకెళ్లారు. అక్కడ కూడా డీవీఎం బాక్సును ఎత్తుకెళ్లారు. చోరీలకు ఉపయోగించిన ఇనుప రాడ్లను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. గతంలో చోరీలకు పాల్పడి జైలు కెళ్లి వచ్చిన పాత నేరస్తులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, ఆ దొంగలను పట్టుకోవడం వారికి సవాలుగా మారింది. శివారు కాలనీల్లో నివాసముంటున్నవారు మరింత ఆందోళన చెందుతున్నారు. చాలామంది పరిశ్రమల్లో పనిచేస్తుంటారు. రాత్రి విధులకు వెళ్తుండటంతో ఇంట్లో మహిళలు, పిల్లలు మాత్రమే ఉంటారు. దాంతో తమ ఇంట్లో ఏ సమయంలో దొంగలు పడతారోనని భయాందోళన చెందుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





సాయిబాబా కాలనీలో ఇంటి తలుపులను తన్నుతున్న దొంగ, వదిలివెళ్లిన ఐరన్ రాడు, స్క్రూడ్రైవర్లు(ఫైల్)

వ్యాపారులు ఫుడ్ సేఫ్టీపై శిక్షణ తీసుకోవాలి

ధారూరు, జూలై 6: ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ శిక్షణ తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ సునీత తెలిపారు. శనివారం ఆమె ధారూరు మార్కెట్‌లోని కిరాణా దుకాణాలు, హోటళ్లు, టీస్టాల్ వ్యాపారుల వద్దకు వెళ్లి ఫుడ్ సేఫ్టీ లైసెన్సు శిక్షణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడతూ.. ఫుడ్ సేఫ్టీ లైసెన్సుపై వ్యాపారులకు అవగాహన లేదని, ఎవరి వద్ద కూడా ఈ లైసెన్సులు లేవని ఆమె తెలిపారు. కల్తీ ఆహార పదార్థాల విక్రయాల నిరోధానికి ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీపై శిక్షణ ఇస్తామని ఆమె చెప్పారు. కిరాణ దుకాణాలు, హోటళ్లు, టీ స్టాళ్లు నిర్వహించే వ్యాపారులు శిక్షణ తీసుకునేందుకు సహకరించాలని కోరారు. పంచాయతీ లైసెన్సుతో పాటు ఫుడ్ సేఫ్టీ, ఫైర్, ఎంఎస్‌ఎంఈ వంటి లైసెన్సులను వ్యాపారులు తీసుకోవాల్సి ఉంటుందని ఆమె వివరించారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్సు వల్ల వ్యాపారులకు ప్రయోజనం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ లైసెన్సులను మీ సేవ ద్వారా తగిన రుసుం చెల్లించి పొందవచ్చని వ్యాపారులకు తెలియజేశామని, తాండూర్, వికారాబాద్ ప్రాంతాలలో కూడా క్షేత్రస్థాయిలో వ్యాపారులకు ఈ అంశంపై అవగాహన కల్పిస్తున్నామని ఆమె తెలిపారు.



కిరాణ షాపు యజమానికి రశీదు ఇస్తున్న సునీత

పల్లెల్లో పడకేసిన 'ప్రత్యేక' పాలన

● గ్రామాలకు చేరని బ్లీచింగ్ పౌడర్ ● ఫాగింగ్ కరువు.. దోమల దరువు ● ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



దోమలకు నిలయంగా మారిన బషీరాబాద్‌లోని రోడ్డు

బషీరాబాద్, జూలై 6: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రత్యేక పాలనలో దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల పట్ల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సమస్యలపై దృష్టి సారించడం లేదు. అసలే వర్ష కాలం.. ఆపరిశుభ్రత.. ఆపై చీకటి పడితే చాలు ఏ వార్డులకెళ్లినా దోమత మోత విన్పిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో ప్రధాన రోడ్లతో పాటు ఆయా గ్రామాల్లోని పలు వార్డుల్లోని అంతర్గత రోడ్లపై వర్షం నీరు, మురుగు కాల్వల నిండి పారిశుధ్యం లోపించడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీల్లో మురుగు కాల్వల నిర్వహణ సక్రమంగా లేక దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన వెంటనే సర్పంచులు పంచాయతీలకు బ్లీచింగ్ పౌడర్ తీసుకొచ్చి చల్లించే వారు.. కానీ ప్రత్యేకపాలనలో అదేం కనిపించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బషీరాబాద్‌లోని ప్రధాన రహదారి, పలు వార్డుల్లోని ఖాళీ ప్రదేశాలు, రోడ్లపై వర్షం నీటితో పారిశుధ్యం లోపించి అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్త పరుస్తున్నారు. ప్రతియేటా వర్షకాలంలో ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణకు చర్యలు చేపట్టేవారిని.. ప్రస్తుతం ఆదేం కనిపించడంలేదని ప్రజలంటున్నారు. పలు పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నా.. ప్రత్యేక పాలనలో వాటిని ముట్టుకోవడంలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పంచాయతీల్లో నిధుల లేమితో అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, ఇప్పటికైనా అధికారులు పరిశుభ్రతపై దృష్టి సారించకుంటే దోమలు మరింత వ్యాప్తిచెంది రోగాల ప్రబలే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



గోసాయి కాలనీలో మురుగు కాల్వ ఇలా..

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లిలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మేడ్చల్ టౌన్, జూలై 6: స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని నాయకులు అన్నారు. బాబు జగ్జీవన్‌రాం 38వ వర్ధంతిని శనివారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, స్థానిక కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కీసర: భారత మాజీ ఉపరాష్ట్రపతి బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా మండల అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో చీర్యాల్‌లో పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లిపావని జంగయ్యయాదవ్ అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఘట్‌కేసర్‌లోని యంనంపేట్ చౌరస్తాలోగల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉపప్రధానిగా, కేంద్ర కార్మికశాఖ మంత్రిగా పనిచేసి అనేక సంస్కరణలు చేపట్టిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: ఘనాపూర్, లింగాపురంలో శనివారం బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బద్దం గోపాల్‌రెడ్డి, రూప్‌సింగ్‌నాయక్, నాయకులు సత్తయ్య గౌడ్, సురేష్‌నాయక్, నర్సింహ, శంకర్‌గౌడ్, యాదగిరి, చంద్రారెడ్డి, దేవ్‌సింగ్‌నాయక్, సంజీవ, స్వామి, వంశీ పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని మూడుచింతలపల్లి మాజీ సర్పంచ్ జాము రవి అన్నారు. జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం మూడుచింతలపల్లిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెంకటరమణరెడ్డి, మాజీ వార్డుసభ్యులు రాజేంద్రప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ముల్లి పావని

నవాబుపేట: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని దళిత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరిగి: దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిగిలోని పాలకేంద్రం దగ్గర బాబూ జగ్జీవర్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు నాగులపల్లి రామకృష్ణ, చిన్ననర్సింహులు, రియాజ్, మల్లేశ్‌యాదవ్, గోపాల్, శ్రీనివాస్, వెంకటేశ్, ఎజాజ్, రత్నం పాల్గొన్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలో సంఘ సంస్కర్త, భారత ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మండల దళిత యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల దళిత యువశక్తి యువజన సంఘం అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, యువజన సంఘం సభ్యులు వెంకటేశం, మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ ఆనందం, ఎల్లయ్య, చుక్కయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

పరిగి, జూలై 6: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకలను శనివారం పరిగిలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, శ్రీశైలం, విజయ్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: శ్యామాప్రసాద్ ముఖర్జీ జీవితం యువతరానికి ఆదర్శమని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ అన్నారు. ముఖర్జీ జయంతి వేడుకల సందర్భంగా మైసమ్మగూడలో శనివారం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, రాజు, ఆంజనేయులు, నాగరాజు, కృష్ణ , అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ స్ఫూర్తితో మొక్కలు నాటాలి

పరిగి, జూలై 6: ప్రతీఒక్కరు ప్రధాని మోదీ స్ఫూర్తితో మొక్కలు నాటాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వార్ల ఆంజనేయులు అన్నారు. వికసిత్ భారత్‌లో భాగంగా మూడవ వార్డులోని శ్రీసాయిధాన్యమందిరం ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింహులు, శ్రీనివాస్, మల్లేశ్, సాయికిరణ్, సుదర్శన్ పాల్గొన్నారు.

కులకచర్ల: ఘనపూర్‌లో శనివారం దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు జెమిని సురేశ్, స్థానిక నాయకులు రామచంద్రయ్య, రాములు, ఆంజనేయులు, హనుమంతు, శివ, నరేశ్ పాల్గొన్నారు.

వైభవంగా వారాహి అమ్మవారి పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

తాండూరు, జూలై 6: ఆషాడ మాసం సందర్భంగా వారాహి దేవి నవరాత్రుల ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని నగరేశ్వర దేవాలయంలో ప్రత్యేక ఉత్సవాలను ప్రారంభించారు. సంఘం అధ్యక్షురాలు కొత్రిక నాగలక్ష్మీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, నగరేశ్వర దేవాలయ చైర్మన్ కుంచెం మురళీధర్, మంకాల స్వప్న, సభ్యులు అమ్మవారి పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.

ప్రజా రక్షణే పోలీసుల లక్ష్యం



బషీరాబాద్: ప్రజలతో సమావేశమై కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ

బషీరాబాద్, జూలై 6: ప్రజల రక్షణే పోలీసుల లక్ష్యమని బషీరాబాద్ ఏఎస్ఐ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక ప్రజలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఇటీవల ప్రవేశపెట్టిన కొత్త చట్టాలపై పోలీస్ సిబ్బందితో కలిసి ఆయన అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుళ్లు లోక్యానాయక్, రాఘవులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గస్తీదళానికి ముందుకు రావాలి

దౌల్తాబాద్: గస్తీ దళం కోసం యువకులు ముందుకు రావాలని దౌల్తాబాద్ ఎస్ఐ రవిగౌడ్ అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం అంతరాష్ట్ర సరిహద్దులో ఉండటంతో దొంగల ముఠా గ్రామాల్లో తాళాలు వేసి ఉంచిన ఇళ్లలో దొంగతనాలకు దుండగులు పాల్పడుతున్నారని, గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు ఇతర గ్రామాలకు పనినిమిత్తం వెళ్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించే పోలీసులతో పాటు గ్రామాల్లో యువకులు స్వచ్ఛందంగా వస్తే దొంగతనాలను నివారించవచ్చని తెలిపారు.

సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్: రోజు రోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనురాగ్ యూనివర్సిటీ డీన్ ఎం.తృప్తి తెలిపారు. కాచవానిసింగారం మండల పరిషత్ పాఠశాలలో శనివారం అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'డిజిటల్ లిటరసీ ఫ్రమ్ టాక్స్ టు థాట్స్' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీలు విజయ్‌కుమార్, మల్లికార్జున్‌రెడ్డి, అధ్యాపకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, విద్యాసాగర్, అనిశ్చంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



మేడ్చల్ టౌన్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ పద్మ జగన్‌గౌడ్

మేడ్చల్ టౌన్, జూలై 6: మండలంలోని గౌడవెల్లి గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం వారిని మేడ్చల్ మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి సన్మానించారు. వారితో పాటు కొత్తగా వచ్చిన నలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు జగన్ రెడ్డి, సురేందర్ ముదిరాజ్, హెచ్‌ఎం విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: అలియాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పుష్పలత, విజయలక్ష్మి, రమేష్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించి వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు, సగ్గు శ్రీనివాస్, కోడూరి అశోక్, బీఆర్ఎస్ నాయకుడు తాళ్ళ జగదీశ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సుధాకర్, రామ్మోహన్, సుధాకర్‌రెడ్డి, రాణి, రేష్మ, రాధిక బదిలీ కాగా వారిని కాంగ్రెస్ పార్టీ తూంకుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలేశ్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కట్ట మీనా, నాయకులు డాక్టర్ సింగం రామారావు, రామాలయ మాజీ ధర్మకర్త పట్నం నర్సింహారెడ్డి, పూజారి రామాచారి పాల్గొన్నారు.



పరిగి: బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

పరిగి: లక్నాపూర్ పాఠశాలలో పని చేస్తున్న హెచ్‌ఎం లక్ష్మీనర్సింహులు, టీచర్ రేఖలు బదిలీపై వెళ్లిన సందర్భంగా శనివారం వారికి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కొత్తగా వచ్చిన టీచర్లు సూర్యనారాయణ, శివకుమార్,అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ అధ్యక్షురాలు అమ్ము తమ్మ, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పార్వత్‌రెడ్డి, రమేశ్, శ్యామలయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బషీరాబాద్: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన జి.మాధవరెడ్డి, వైస్ చైర్మన్ మూడవత్ చందర్ తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. వీరి వెంట సీనియర్ నాయకులు బాస్పల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌రావు ఉన్నారు.

● **తాండూరు:** ఎస్ కంప్యూటర్ ఆధ్వర్యంలో వేసవిలో కంప్యూటర్ శిక్షణ పొంది పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శనివారం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. వీరభద్రప్ప, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

● **వికారాబాద్/బొంరాస్‌పేట్:** వికారాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ పూర్ణచందర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా దుద్యాల మండలంలోని ఆలేడ్, దుద్యాల విద్యుత్ ఫీడర్ మెయింటెనేన్స్ నిమిత్తం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **దోమ:** మండల కేంద్రంలో మీ సేవ కేంద్రాలు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదని, ప్రతీ నెల సదరం శిబిరాల కోసం స్లాట్ బుక్ చేసుకునేందుకు వెళితే తమకు ఎలాంటి సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని అయినాపూర్ గ్రామానికి చెందిన బాధితుడు ఆంజనేయులు వాపోయాడు.

● **వికారాబాద్:** కనకాల కట్టమైసమ్మ బోనాలు ఆదివారం లోయర్ ట్యాంక్ బండ్ దగ్గర మధ్యాహ్నం 12.30 గంటలకు రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు.

● **తాండూరు రూరల్:** జినుగుర్తి ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను ఎన్ఎస్‌యూఐ వికారాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అంకిత్ శనివారం సందర్శించారు.

● **తాండూరు రూరల్:** మండలానికి చెందిన నాయకుడు అజ్మత్‌కు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమించడంపై మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్, వల్లిగారి శామప్ప పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్:** చౌదరిగూడలో గల నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జనరేటివ్ హ్యాకతాన్ సదస్సుకు ఆర్‌ఆర్‌ఎస్ సొల్యూషన్స్ హైదరాబాద్ ఇంజనీరింగ్ టీం డైరెక్టర్ బి.నాగలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి, జనార్ధన్‌రాజు, ఆయా విభాగాల డీన్లు పాల్గొన్నారు.

వంద రూపాయల పంచాయితీ..

● నిండుప్రాణం బలి



హత్యకు గురైన పోచయ్య



నిందితుడిని చెట్టుకు కట్టేసిన స్థానికులు

మేడ్చల్ టౌన్, జూలై 6 : ఇద్దరు కూలీల మధ్య జరిగిన వంద రూపాయల గొడవ హత్యకు దారి తీసింది. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లేబర్ అడ్డా వద్ద శనివారం చోటు చేసుకుంది. మేడ్చల్ పట్టణం వెంకట్‌రాంరెడ్డినగర్‌కు చెందిన విభూతి పోచయ్య(45), మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి ఉపాధికోసం వలస వచ్చిన యువకుడు ధర్మేంద్ర మేడ్చల్ పట్టణంలోని గ్రంథాలయం సమీపంలోని లేబర్ అడ్డాపై కూలీలుగా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇటీవల పోచయ్య రోజు వారి కూలీ పని కోసం తనతో పాటు లేబర్ అడ్డా వద్ద ఉండే ధర్మేంద్రను తీసుకు పోయాడు. కూలి పని చేయించుకుని అతనికి ఇవ్వాల్సిన డబ్బుల్లో రూ.100బాకీ పెట్టాడు. దీంతో శనివారం ఉదయం అడ్డాపై ధర్మేంద్ర పోచయ్యను బాకీ ఉన్న వంద రూపాయలు అడిగాడు. దీంతో ఇరువురు ఘర్షణ పడి సమీపంలోని అయ్యప్ప ఆలయంలో మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం తిరిగి అడ్డా వద్దకు వచ్చి వందరూపాయల కోసం మళ్లీ గొడవపడ్డారు. ఈ క్రమంలో ధర్మేంద్ర సమీపంలో ఉన్న సిమెంట్ రాయితో పోచయ్య తలపై బాదాడు. దీంతో పోచయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ధర్మేంద్ర అక్కడి నుంచి తప్పించుకోవడానికి యత్నించగా కూలీలు అతనిని పట్టుకుని దేహశుద్ధి చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచరణ చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

కీసర రూరల్, జూలై 6: బాలికపై లైంగికదాడికి పాల్పడిన సంఘటన శనివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని ఓ గ్రామంలో ఓవ్యక్తి టీ కొట్టు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతనికి కూతురు (14) ఉంది. కాగా ఆ గ్రామంలో ఓకంపెనీ నుంచి ఫర్నిచర్‌ను భైంసాకు తరలించేందుకు బహద్దూర్‌పూరకు చెందిన డ్రైవర్ మాసన్‌పల్లి మహేష్(25) తన డీసీఎం తీసుకుని శుక్రవారం రాత్రి కంపెనీ వద్దకు చేరుకున్నాడు. కాగా శనివారం తెల్లవారు జామున రెండు గంటల సమయంలో ఆ బాలిక బాత్రూంకు వెళ్లింది. గమనించిన మహేష్ ఆ బాలిక నోరు మూసి డీసీఎంలోకి ఎత్తుకెళ్లి అత్యాచారం చేశాడు. కూతురు గదిలో లేదని గమనించిన తండ్రి అమ్మాయి కోసం వెతికాడు. సమీపంలోని డీసీఎం వైపునకు రాగా మహేష్ ఆ బాలికను డీసీఎం కాబిన్ నుంచి కిందికి నెట్టేశాడు. మహేష్‌ను బాలిక తండ్రి వెంబడించగా అతడు తోసేసి డీసీఎంతో సహా పరారయ్యాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మహేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

● 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు అపహరణ

ఘట్‌కేసర్ రూరల్, జూలై 6: ఆరోగ్యం బాగలేదని కూతురిని ఆసుపత్రికి తీసుకెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌదరిగూడ, వెంకటాద్రి ఫేస్-2లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇటికల ప్రవీణ్‌కుమార్ (34) తన కూతురుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం సాయంత్రం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వచ్చి చూసేసరికి మేయిన్‌గేటు తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువాలో దాచిన 23తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు కనిపించక పోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించి, సీసీ ఫుటేజీలు, క్లూస్ టీంతో రాలు సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని విద్యార్థి దుర్మరణం

● వెనుక నుంచి బైక్‌ను ఢీకొన్న లారీ ● అక్క పుట్టిన రోజే తమ్ముడి మృతి



ఘటనాస్థలంలో రోధిస్తున్న కుటుంబసభ్యులు

తాండూరు రూరల్, జూలై 6: అక్క పుట్టిన రోజును సంబరంగా జరుపుకోవాలన్న తమ్ముడి ఆనందం ఎంతోసేపు నిలవలేదు. లారీ రూపంలో మృత్యువు కబళించడంతో కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. ఈ ఘటన తాండూరు మండలం గౌతాపూర్-గోపన్‌పల్లి మార్గంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని అనంతపూర్ జిల్లా గుత్తి మండలం అనగానిదొడ్డికి చెందిన హన్మంతు, వరలక్ష్మి దంపతులు కుటుంబంతో కలిసి కొంతకాలం కిందట తాండూరు మండలానికి వలస వచ్చారు. మండలంలోని గోపన్‌పల్లి సమీపంలో నజీర్‌సేట్ అనే పాలిషింగ్ యూనిట్ వ్యాపారి వద్ద కూలీలుగా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం హన్మంతు తన కూతురు శశికళ, కుమారుడు మదం జనార్దన్(8)ఉన్నారు. కుమారుడు జనార్దన్‌ను తాండూరులోని విజయ విద్యాలయ పాఠశాలలో వదిలేందుకు బైక్‌పై బయల్దేరాడు. గ్రామ సమీపంలోకి రాగానే వెనుకనుంచి వస్తున్న లారీ వీరి బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన జనార్దన్ తల నుజ్జునుజ్జయి విద్యార్థి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కళ్లముందే కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు విలవిల్లాడిపోయారు. బాలుడి అక్క శశికళ పుట్టిన రోజు కావడంతో సాయంత్రం పాఠశాల నుంచి రాగానే పుట్టిన రోజు వేడుక సంతోషంగా జరుపుకోవాలనుకున్నామని, అక్క పుట్టిన రోజున తమ్ముడు కానరాని లోకానికిపోయాడంటూ తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి కరన్‌కోట్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

కారు చెట్టును ఢీకొని యువకుడు..



రాజేందర్ మృతదేహం



చెట్టుకు ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

కీసర రూరల్, జూలై 6: కారు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోగారం గ్రామంలోని హోలీమేరీ కాలేజీలో చదువుకుంటున్న రాజేందర్(20), విశ్వతేజ, యశ్వత్‌లు స్విఫ్ట్ డిజైర్ కారులో కీసర నుంచి బోగారం మీదుగా హోలీమేరీ కళాశాల వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో బోగారం గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి వద్దనున్న మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేందర్ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన విశ్వతేజ, యశ్వత్‌లకు చికిత్స అందిస్తున్నారు. మృతుడు రాజేందర్ స్వస్థలం ధర్మపురి కాగా ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మద్యం మత్తులో కారు నడపడంవల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు వెల్లడించారు.

పోతాయిపల్లిలో దొంగల ముఠా అరెస్ట్



నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

మూడుచింతలపల్లి, జూలై 6: ధనిక కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను ఎస్‌వోటీ, శామీర్‌పేట్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి పట్టుకుని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నాటకకు చెందిన కొందరు సహచరులు అల్వాల్‌కు చెందిన చింతల కృష్ణారెడ్డి, బండ్లగూడకు చెందిన సలీమ్ తమీమీ, జవహర్‌నగర్‌కు చెందిన జెర్రిపోతుల భూమయ్య, క్యాపాకు చెందిన పెనుబెల్లి శ్రీనివాస్‌లు ముఠాగా ఏర్పడి ధనికుల నివాసాలను ఎంచుకుని దోపిడీలు చేసేందుకు కుట్రపన్నారు. ఈ కుట్రలో భాగంగానే తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని పోతాయిపల్లి గ్రామంలో నివాసముంటున్న ఓ రియల్ఎస్టేట్ వ్యాపారిని లక్ష్యంగా చేసుకుని వారి ఇంట్లో డబ్బులు ఉన్నాయని తెలుసుకుని దోపిడీకి పన్నాగం పన్నారు. కొద్దిరోజుల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంటిపై రెక్కీ నిర్వహించారు. బక్రీద్ పండుగ తర్వాత దోపిడీ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో జూలై 5న, 2024 పోతాయిపల్లి గ్రామంలోని విరించి ఫార్మాకంపెనీ దగ్గర ఉన్నారు. అటువైపుగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు వారి కదలికలను చూసి అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టారు. దీంతో నిందితుడు దోపిడీకి వచ్చినట్లు పోలీసుల ముందు అంగీకరించారు. దీంతో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కత్తులు, ఐదు సెల్‌ఫోన్లు, కారు, మూడు బైక్‌లు, ఆటో స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన అశ్రఫ్, కేరళకు చెందిన తౌసీపాషా, మరికొందరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. త్వరలోనే వారిని పట్టుకుంటామని చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్యా పన్నాగమా? లేక దోపిడీలే లక్ష్యమా?

దోపిడీ ముఠాకు సంబంధించిన వివరాలు కానీ దోపిడీ చేసేందుకు చూసిన తీరును చూస్తే నమ్మేలాగా లేవని ప్రజలు అంటున్నారు. దీనికి కారణం కర్ణాటకకు చెందిన కొందరు మరి కొందరితో మాట్లాడి డబ్బులు ఇస్తానని చెప్పి కొంత మందిని చేర్చుకుని ధనిక కుటుంబాలను, డబ్బులు ఎవరి వద్ద ఉన్నాయో తెలుసుకుని టార్గెట్‌గా చేసుకుని లోకల్ గ్యాంగ్‌తో చోరీలకు పాల్పడేందుకు కుట్రపన్నారు. ఇదంతా సినీ ఫక్కీలో ఉందని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రెక్కీ నిర్వహించి ఇంచుమించుగా 20 రోజులు కావస్తున్నా టార్గెట్ చేసిన పోతాయిపల్లిలో దోపిడీ దొంగలు చోరీలకు పాల్పడలేదు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మహేంద్ర తార్ కారును ఉపయోగించడం, మారణాయుధాల(కత్తులు)తో రావడం పలు అనుమానాలకు తావిస్తోందని పలువురు అంటున్నారు. ఈ ముఠా దోపిడీకే వచ్చిందా? లేక సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారిని హత్య చేసేందుకు పన్నాగం పన్నిందా? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సెల్‌ఫోన్లు అపహరించిన నిందితుడి రిమాండ్



నిందితుడు ఉమేష్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 6: సెల్‌ఫోన్లను అపహరించుకెళ్లిన నిందితున్ని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. క్రైం సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 5వ తేదీ తెల్లవారుజామున ఘట్‌కేసర్‌లోని బ్రూక్‌బాండ్ కాలనీలో నివాసం ఉండే రేనాదేవి ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి చొరబడి రూ.80వేల విలువ గల మూడు సెల్‌ఫోన్లను అపహరించుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. శనివారం ఉదయం ఘట్‌కేసర్ బస్టాండ్ ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ యువకున్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. మహారాష్ట్ర, నాందేడు జిల్లా, కందర్ గ్రామానికి చెందిన ఉమేష్ అలియాస్ లడ్డు(20) ఘట్‌కేసర్‌లోని రాంనగర్‌లో ఉంటూ కూలీపనులు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిపారు. ఇటీవల జల్సాలకు అలవాటుపడి పని మానేశాడు. ఈ నెల 5న రేనాదేవి ఇంట్లోకి చొరబడి మూడు సెల్‌ఫోన్లను అపహరించినట్లు ఉమేష్ అంగీరించినట్లు పోలీసులు తెలిపారు. ఉమేష్‌పై గతంలో రెండు కేసులు ఉన్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పరిగి, జూలై 6: వ్యాధులు దరిచేరకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, కమిషనర్ వెంకటయ్యలు అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ వారోత్సవాలలో భాగంగా మునిసిపల్, వైద్యశాఖల ఆధ్వర్యంలో శనివారం పరిగిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కిరణ్, ఆరోగ్య శాఖ అధికారి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: అంతర్జాతీయ జంతు దినోత్సవం సందర్భంగా శనివారం కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్ పశువైద్య శాలలో మూగజీవాలకు సంక్రమించే సీజనల్ వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించారు.